నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శుక్రవారం 9 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM

'సహకార' నిధుల కేటాయింపుల్లో.. కేంద్రం విఫలం

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో వ్యాపార కేంద్రాన్ని నెలకొల్పాలి

రాజ్యసభలో 'సహకార రంగంపై చర్చ'లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఆగస్టు 8: సహకార రంగానికి నిధుల కేటాయింపులో కేంద్రం విఫమైందని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ వ్యాపార కేంద్రాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సహకార రంగం పై పార్లమెంటులో గురువారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 2021 జూలై 6న ప్రధాని మోదీ కొత్తగా సహకార మంత్రిత్వ శాఖను ప్రవేశపెట్టి సహకార సంఘాల కార్యాలయాలను కంప్యూటరైజ్ చేయడం వల్ల వాటిల్లో పారదర్శకత పెరిగి సభ్యులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. అయితే, గత పదేళ్లలో తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు, మహిళా, చేనేత సహా పలు వృత్తి కార్మికులకు ఆయా సహకార సంఘాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంతో రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి పురోగతి సాధించిందని గుర్తుచేశారు. తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలమైన సహకార రంగం బలోపేతానికి పెద్ద ఎత్తున కృషి జరిగిందన్నారు. ఫలితంగా వ్యవసాయ, దాని అనుబంధ సహకార రంగాలు అద్భుతమైన ప్రగతిని సాధించాయని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్లకు స్థలాలు చూడండి

- **జిల్లాలో ప్రభుత్వ భూములను సంరక్షించండి**
- **సీఎం వస్తున్నందున ఖమ్మాన్ని తీర్చిదిద్దండి**
- **కలెక్టర్, స్పెషలాఫీసర్‌తో మంత్రి తుమ్మల**

ఖమ్మం కలెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి, కేఎంసీ కమిషనర్‌లతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 8: ఖమ్మం నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటన నిమిత్తం ఖమ్మానికి వచ్చిన రాష్ట్ర హౌసింగ్ శాఖ కమిషనర్, స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమ జిల్లా స్పెషలాఫీసర్ వీపీ గౌతమ్, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్.. ఖమ్మంలో మంత్రి తుమ్మలను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను సంరక్షించాలని ఆదేశించారు. వాటిని ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం వినియోగించాలని సూచించారు. ఖమ్మం నగరంతోపాటు రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. వాటికి ఫెన్సింగ్ వేసి బందోబస్తు చేయాలని ఆదేశించారు. గోళ్లపాడు ఛానెల్ పెండింగ్ పనులు నాణ్యత ప్రకారం పూర్తి చేయాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును ఎకో టూరిజం పార్కుగా చేయాలన్నారు. జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఉన్న నేపథ్యంలో ఖమ్మం నగరాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఖమ్మంలో మరో ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సైతం చూడాలని ఆదేశించారు. 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేయాలని కోరారు. కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల వృద్ధికి ఇంకుడు గుంతలు

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఇంకుడు గుంత నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చుంచుపల్లి, ఆగస్టు 8 : వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, అప్పుడే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. విద్యానగర్ కాలనీ పంచాయతీ కార్యాలయంలో నిర్మించిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఇంకుడు గుంతల నిర్మాణాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించడం వల్ల భవనం పైనుంచి పడిన వర్షపు నీరు అందులోకి చేరి భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడుతాయన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భవిష్యత్ తరాలకు కూడా నీటి సమస్య లేకుండా ఉంటుందన్నారు. అనంతరం మొక్కలు నాటిన కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విద్యాచందన, తహసీల్దార్, విద్యానగర్ ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, ఈజీఎస్ ఈసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఆగస్టు 8 : గిరిజన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భద్రాచలం ఐటీడీఏ గిరిజన భవనంలో ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ, వసతి గృహాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పీవో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత తరానికి గిరిజనులు జరుపుకునే ప్రధాన పండుగల ప్రాముఖ్యత, విధానం గురించి తెలుసుకునే విధంగా పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా సంస్కృతీ సంప్రదాయాలను అక్కడి ప్రజలకు తెలిసేలా వ్యవహరించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల్లో ప్రతి అంశంలో ముగ్గురి చొప్పున ఎంపిక చేసి వారికి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, హెచ్ఎంలు భద్రయ్య, బుచ్చిరాములు, నాగమణి, సరోజిని, సుభద్ర, కృష్ణయ్య, రాధ, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల ఒక్కరోజు సమ్మె

సమ్మెకు మద్దతు తెలిపిన సీఐటీయూ

కారేపల్లిలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కారేపల్లి, ఆగస్టు 8 : తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు మండల కేంద్రంలో గురువారం ఒక్కరోజు సమ్మె చేపట్టారు. శిబిరం వద్దకు చేరుకున్న సీఐటీయూ బృందం కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా ఆ సంఘం మండల కార్యదర్శి కుందనపల్లి నరేంద్ర మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లు రెయింబవళ్లు శ్రమిస్తున్నా.. వారిపట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు షేక్ హుస్సేన్, కొమరయ్య, ఆదెర్ల గౌతమ్, షేక్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డలు.. ఆదివాసీలు

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

గిరిపుత్రులకు భరోసానిచ్చిన గత కేసీఆర్ ప్రభుత్వం

చరిత్రలో నిలిచిపోయిన 'పోడు పట్టాల పంపిణీ'

ప్రతి గూడేనికి మిషన్ భగీరథ నీరు

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : గూడెం అంటేనే అది ఆదివాసీలు నివసించేది. గిరిజన సంస్కృతి ఉట్టిపడే ఆదివాసీ పల్లెల్లో గిరిజనుల ఇళ్లు, వారి కట్టుబాట్లు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యమనిస్తుంది. పుట్టింది.. పెరిగింది గూడేల్లోనే అయినా అడవి తల్లిని నమ్ముకుని ప్రకృతి సంపదను ఉపాధిగా మలుచుకుని బతుకుతున్న ఆదివాసీ బిడ్డలకూ ఓ రోజు ఉంది.. అదే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం. అటు అటవీ శాఖ ఆటుపోట్లు, ఇటు అభివృద్ధి పేరుతో గుడిసెలను కూలుస్తున్నా అడవి నుంచి బయటకు రాకుండా అక్కడేపడి జీవిస్తున్న ఆదివాసీల గురించి ఎంతచెప్పినా తక్కువే. వారికి సమాజంలో ఒక ప్రత్యేకత ఉంది. ఆచారాలు, అలవాట్లు, పెళ్లిళ్లు, పండుగలు అన్నీ ప్రత్యేకమే.

నేడు అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం

1982, ఆగస్టు 9వ తేదీన జెనీవాలో అటవీ వనరుల హక్కులకు సంబంధించిన సమస్యలపై 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూపుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివాసీల కోసం ఒకరోజు ఉండాలని ఐక్యరాజ్య సమితిని కమిటీ కోరగా, ఆదివాసుల సంరక్షణ చట్టాలకు ఐక్యరాజ్య సమితి ఆమోదం తెలిపింది. ఈ కమిటీ ఆగస్టు 9వ తేదీని 'అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం'గా ప్రకటించింది.

గత బీఆర్ఎస్ హయాంలో గిరిపుత్రులకు భరోసా..

దుర్భర జీవితం గడుపుతున్న ఆదివాసీల జీవితాల్లో తెలంగాణ రాష్ట్రం వచ్చాక వెలుగులు నిండాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీడీఏ ఉన్నా వారికి రావాల్సిన నిధులు పక్కదారి పట్టడంతో ఆదివాసీలు గూడేలకే పరిమితమయ్యారు. వచ్చే రుణాలు సక్రమంగా వారికి 1992 నుంచి పది సంవత్సరాలపాటు ప్రపంచవ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించి 1994 నుంచి 2014 వరకు ఆ మధ్య కాలాన్ని ఆదివాసీల అభివృద్ధికాలంగా పరిగణించి చేరక అభివృద్ధి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. తెలంగాణ వచ్చాక ఆదివాసీ పల్లెలు పట్నాలకు దగ్గరయ్యాయి. మారుమూల గ్రామపంచాయతీల ద్వారా అభివృద్ధిని గిరిజన గ్రామాలకు చేర్చడంతో ప్రతి గ్రామం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దబడింది. ఈరోజు దేశంలో ఆదర్శ గ్రామ పంచాయతీలు ఉన్నాయంటే అవి గిరిజన పంచాయతీలే అని చెప్పుకోవచ్చు. నాడు గుడిసెలుగా ఉన్న గ్రామాల్లో నేడు పక్కా ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. అంటే గిరిజనులు ప్రభుత్వ పథకాల వల్ల ఆర్థికంగా ఎదిగారు అని చెప్పొచ్చు. ట్రైకార్ రుణాలు, గిరివికాస్ ద్వారా పంట పొలాల వద్ద మోటర్లు, సబ్సిడీ రుణాలు, ఐటీడీఏ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు, గురుకులాల్లో ఉద్యోగాలు ఒకటి కాదు రెండు కాదు వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు సాగుకు రైతుబంధు ఇచ్చి వ్యవసాయపరంగా ప్రోత్సహించడంతో గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు అభివృద్ధిలో పోటీపడే స్థాయికి వచ్చేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గూడేనికి నల్లా ఇచ్చి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. గొత్తికోయల గ్రామాల్లో సోలార్ ద్వారా తాగునీరు ఇచ్చి గిరిజన కుటుంబాలను ఆదుకున్నారు.

పోడు పట్టాలిచ్చిన చరిత్ర కేసీఆర్‌దే..

ఎన్నో ఏళ్లుగా అడవిలో పోడుకొట్టి సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు గత కేసీఆర్ ప్రభుత్వం పోడు పట్టాలు ఇచ్చి వారికి సముచిత స్థానాన్ని కల్పించింది. జిల్లాలో 51 వేల మంది రైతులకు పోడు పట్టాలు ఇచ్చి వారికి రైతుబంధు కూడా ఇచ్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా భద్రాద్రి జిల్లాలోనే 1,51,195 ఎకరాలకు గాను.. 50,595 మంది రైతులకు పోడు పట్టాలు ఇచ్చారు.

మళ్లీ పోడు సమస్య రానుంది..

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పోడు రైతులకు పట్టాలు ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మిగిలిపోయిన వారికి పట్టాలు ఇవ్వడం లేదు. అందుకే రైతులు మళ్లీ పోడు పట్టాల కోసం ఉద్యమిస్తున్నారు. రేగళ్ల ప్రాంతంలో నేటికి పోడు సమస్య అలాగే ఉంది. గిరిజన గూడేల్లో తాగునీరు, రహదారి సౌకర్యాలు మెరుగుపర్చాలి. పాలకులు పట్టించుకోకపోవడంతో ఆదివాసీ బిడ్డలు ఆగమవుతున్నారు. ఐటీడీఏ ఉన్నా ఉపయోగం లేకుండా పోతోంది. నిధులు లేని శాఖలు ఉత్సవ విగ్రహాల్లా ఎందుకు ఉండాలి. **–వాసం రామకృష్ణ, ఆదివాసీ నాయకుడు**

పోడు పట్టాలు అందుకుంటున్న గిరిజనులు (ఫైల్)

కేసీఆర్‌తోనే గూడేల అభివృద్ధి

గత ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. గూడేల్లో అప్పట్లో తాగునీరు ఉండేది కాదు. చెలమల నుంచి నీరు తెచ్చుకొని తాగేవారు. ఇప్పుడు మిషన్ భగీరథ నీరు ప్రతీ గ్రామానికి వస్తుంది అంటే అది కేసీఆర్ చలవే. పోడు పట్టాలు దేశ చరిత్రలో ఎక్కడా లేనిది తెలంగాణ రాష్ట్రంలో.. అదీ భద్రాద్రి జిల్లాలో 51 వేల మంది గిరిజనులకు ఇచ్చారు. మౌలిక సౌకర్యాల కల్పనలో నెంబర్ వన్‌గా నిలిచింది ఆదివాసీ గ్రామాలే. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీరు, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, ప్రకృతి వనాలు కనిపిస్తున్నాయి.
–రేగా కాంతారావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

త్వరితగతిన 'సీతారామ' పనులు

- **9.6 కి.మీ. మేర ఏన్కూరు వద్ద లింక్ కెనాల్ ఏర్పాటు**
- **సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

సీతారామ ప్రాజెక్టు టన్నెల్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 8 : సీతారామ ప్రాజెక్టు కెనాల్ పనులను వేగవంతం చేశామని, అందుకు అవసరమైన నిధులను విడుదల చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్స్‌ను పరిశీలించిన అనంతరం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని 9 మండలాల్లో గల 1.75 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు రూ.93 కోట్లు ఖర్చు చేసి 9.6 కి.మీ. మేర ఏన్కూరు వద్ద లింక్ కెనాల్ ఏర్పాటు చేశామన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత యుద్ధప్రాతిపదికన కెనాల్ పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అన్నీ సహకరిస్తే ఈ నెల 15న సీఎం చేతులమీదుగా ఏన్కూరు వద్ద లింక్ కెనాల్‌ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.31 వేల కోట్ల రుణమాఫీని రైతులకు చెల్లిస్తోందన్నారు. రాబోయే కొద్దిరోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్లరేషన్ కార్డులతోపాటు ఆసరా పెన్షన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతగా 4.5 లక్షల ఇళ్లు ఈ నెలాఖరుకల్లా ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతి ఒక్కరికి భరోసా కల్పించేందుకు ధరణి చట్టాన్ని సవరించబోతున్నామని తెలిపారు. ప్రజల అభిప్రాయంతో రెవెన్యూ చట్టాన్ని మారుస్తామన్నారు. గతంలో 2 లక్షల మంది ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నారని, రాబోయే మూడు నెలల్లోపు ఖాయమైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను అప్రూవల్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విభజన చట్టం ప్రకారం కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాల్సి ఉండగా.. రాష్ట్రం పేరును కూడా బడ్జెట్‌లో ఉచ్చరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆంధ్రా రాష్ట్రానికి ఇచ్చిన నిధుల్లో సగమైనా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించి కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, నాయకులు ఉడతనేని అప్పారావు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

- **సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నేతల డిమాండ్**
- **ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా**

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నాయకులు, కార్యకర్తలు

ఖమ్మం/ ఖమ్మం కమాన్‌బజార్, ఆగస్టు 8: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారం చేపట్టి ఇన్ని నెలలు గడుస్తున్నా ఆ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణాలకు రూ.10 లక్షలు అందించాలని, సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీని అమలుచేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని, ఆయా భూములపై హక్కులు కల్పించాలని, రైతుభరోసా అందించాలని, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. తొలుత కలెక్టరేట్ నుంచి వీవీపాలెం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు. పార్టీ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, రామయ్య, అర్జున్ రావు, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ ఎన్నికపై..

కొనసాగుతున్న సస్పెన్స్

డీసీవోను నివేదిక కోరిన సహకార శాఖ కమిషనర్!

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 8: ఖమ్మం డీసీసీబీ చైర్మన్ ఎన్నికపై గడిచిన కొద్ది నెలలుగా సస్పెన్స్ కొనసాగుతోంది. గతంలో డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన వీ వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ కూరాకుల నాగభూషణంపై సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టడం, అది నెగ్గడంతో ఆయన సొసైటీ చైర్మన్ పదవితోపాటు డీసీసీబీ చైర్మన్ పదవిని కూడా కోల్పోయిన విషయం విదితమే. దీంతో డీసీసీబీ వైస్ చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావు ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే, బ్యాంకుకు పూర్తి కాలపు చైర్మన్‌గా ఎన్నిక జరపాలంటూ డీసీసీబీ డైరెక్టర్లు వివిధ రూపాల్లో తమ వాదనను వినిపిస్తున్నారు. ఒక దశలో బ్యాంకు బోర్డు ఇంటర్నల్ సమావేశంలో చర్చించిన అంశాలను కూడా సదరు డైరెక్టర్లు కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం పెట్టి మరీ బహిర్గతం చేసిన సంగతి తెలిసిందే. అనంతరం చైర్మన్ ఎన్నిక గురించి జిల్లా సహకార అధికారికి, రాష్ట్ర సహకార కమిషనర్‌కు వినతిపత్రాలు కూడా ఇచ్చారు. అయితే, తాజాగా గురువారం రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉదయ్‌కుమార్.. ఖమ్మం డీసీసీబీ చైర్మన్ ఎన్నికకు సంబంధించి పూర్తి నివేదికను అందజేయాలని డీసీవోకు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. డీసీవో నివేదికను బట్టి చైర్మన్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది. అయితే, నాలుగు జిల్లాలకు విస్తరించి.. 1.60 లక్షల మంది రైతులకు సేవలందిస్తున్న ఈ సహకార బ్యాంకు పాలకవర్గ సభ్యుల విభేదాలు అటు అధికారులను, ఇటు ఖాతాదారులను ఆందోళనకు గురిచేస్తుండడం గమనార్హం.